క్లుప్తంగా

విమానాశ్రయ ఉద్యోగినుల వితరణ



షాడే స్కూల్ బాలికలకు నిత్యావసరాలు వితరణ చేస్తున్న ఉద్యోగినులు

మధురపూడి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరం విమానాశ్రయం ఉద్యోగినులు, సిబ్బంది శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రాజమహేంద్రవరంలోని షాడే గరల్స్ హాస్టల్‌లోని బాలికలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఆల్కాట్ గార్డెన్స్ డోర్కస్ ఆశ్రమంలో వృద్ధులకు దుస్తులు, దుప్పట్లు అందించారు. ముందు విమానాశ్రయం ప్రాంగణంలో మహిళా దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. విమానాశ్రయంలోని కల్యాణమయి మహిళా సంఘం అధ్యక్షురాలు ఎస్.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం విశిష్టతను వివరించారు. కార్యదర్శి విజయశాంతి, రాధారాణి పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది కలిగేలా ప్రతిపక్షాల తీరు



వంగలపూడి రేవులో పూజలు నిర్వహిస్తున్న డాక్టర్ బాబు

సీతానగరం: పట్టిసీమ వీరభద్రుని దర్శనానికి వంగలపూడి రేవు నుంచి భక్తులు వెళ్లడానికి అన్ని ఏర్పాట్లు చేశామని, అయితే ప్రతిపక్షాల వ్యవహారశైలి భక్తుల మనోభావాలను భంగపరిచేలా ఉందని వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి రమేష్ బాబు (డాక్టర్ బాబు) అన్నారు. ఆయన శుక్రవారం వంగలపూడి రేవు వద్ద మృత్యుంజయుని దర్శించారు. రేవులో ప్రతిపక్ష పార్టీలు ఏర్పాటు చేసిన జెండాల విషయంలో ఆయన స్పందించారు. ఒక్క రూపాయి ఇవ్వకుండా, ప్రజలకు సహకారం అందించడంలో వెనుక ఉంటూ, ప్రచారంలో ఆ పార్టీలు ముందుంటున్నాయన్నారు. వంగలపూడి రేవు నుంచి పట్టిసీమకు నడక మార్గాన్ని భక్తుల సౌకర్యార్థం నిర్మించామని, కణుపూరు కొండపైకి గ్రావెల్ రోడ్డు వేయడం జరిగిందన్నారు. ప్రతిపక్ష పార్టీలు ప్రచార ఆర్భాటంలో భాగంగా జెండాలు ఏర్పాటు చేయడం సరైన పద్ధతి కాదన్నారు.

మహిళ మృతి

సీతానగరం: మండలంలోని చినకొండేపూడికి చెందిన నేలపాటి లక్ష్మి (68) రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. హెడ్ కానిస్టేబుల్ శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. నేలపాటి లక్ష్మికి కడుపు నొప్పి రావడంతో భరించలేక శుక్రవారం తెల్లవారుజామున కలుపు నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె కోడలు విజయదుర్గాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరి ఘాట్లలో పారిశుధ్య చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తుల పుణ్యస్నానాలు, పూజలు, పిండ ప్రదానాల అనంతరం ఘాట్లలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగింపు చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టినట్టు నగరపాలక సంస్థ శానిటరీ సూపర్ వైజర్ ఇంద్రగంటి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు వేలాదిగా తరలివచ్చారన్నారు. ఘాట్లలో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా రెండు విడతలుగా సిబ్బందిని నియమించామన్నారు. కోటిలింగాల, పుష్కర, మార్కండేయ ఘాట్లలో భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు తెలిపారు. నగరంలో 10 ఘాట్‌లలో భక్తులు స్నానాలు ఆచరించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. వైగ్రామ్ ఘాట్, సుబ్బయ్యమ్మ ఘాట్‌లలో స్నానాల ఆచరించేందుకు అనుమతులు లేవన్నారు. కమిషనర్ దినేష్ కుమార్ ఆదేశాలతో తెల్లవారుజామునుంచే కార్మికులు పనులు ప్రారంభించారన్నారు.

హరహర మహాదేవ..

- ఘనంగా మహాశివరాత్రి పూజలు
- కిటకిటలాడిన ఆలయాలు

రాజానగరం: హరహర మహాదేవ.. శంభోశంకర అన్న భక్తుల నామస్మరణతో శివాలయాలు మార్మోగాయి. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నియోజవర్గంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. రాజానగరం రాజలింగేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచీ పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. దివాన్ చెరువు ఆగమ ఆశ్రమంలోని కాశీఅన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, జాతీయ రహదారిని ఆనుకుని నరేంద్రపురం జంక్షన్ వైపు ఉన్న ఈతచెట్టు ఈశ్వరుడు, తూర్పుగానుగూడెం, పల్లకడియం, నందరాడ, నరేంద్రపురం, జి.యర్రంపాలెం, కానవరం, సంపత్‌నగరం, తదితర గ్రామాలలోని శివాలయాలకు భక్తుల తాకిడి అధికంగా ఉంది. సంపత్ నగరంలోని పర్వతవర్ధని శివనాగేశ్వరునికి ముందు రోజు (గురువారం) రాత్రే కల్యాణోత్సవం నిర్వహించారు.



రాజానగరం రాజలింగేశ్వరుని ఆలయ ప్రాంగణంలో మట్టితో తయారుచేసిన శివపార్వతుల విగ్రహాలు

శివరాత్రి సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించి, రాత్రి రుద్రాభిషేకం చేశారు. దివాన్ చెరువులోని శ్రీలక్ష్మీగణపతి ఆలయం వద్ద నిర్మించిన నమూనా ద్వాదశ జ్యోతిలింగాలను దర్శించుకున్నారు. అలాగే జాతీయ రహదారి ఆనుకుని ఉన్న ఆలయాలలో కొంతమంది దాతలు భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు.

మట్టితో ఆదిదంపతుల విగ్రహాలు

రాజానగరంలోని రాజలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మట్టితో తయారు చేసిన ఆది దంపతుల విగ్రహాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయంలో పరమశివుని దర్శించుకున్న భక్తులందరూ ఇక్కడకు వచ్చి, ఆ విగ్రహాలకు కూడా పూజలు చేశారు. వాటిని తయారు చేసిన సూర్యారావుపేటకు చెందిన వెంకటేష్‌వర్మ అనే యువకుడిని అభినందించారు. అలాగే ఇదే ప్రాంగణంలో దేవరపల్లి సమీపంలోని గాంధీపురానికి చెందిన బృందం భజనలు చేసింది.

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పూజలు

సీతానగరం: కాటవరం, మునికూడలి, ముగ్గళ్ల, సీతానగరం గ్రామాల్లోని శివాలయాల్లో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పూజలు నిర్వహించారు. వంగలపూడి రేవు వద్ద గల మృత్యుంజయుని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధన పాల్గొని వడ్డన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, కొంచ భాస్కరరావు, నీరుకొండ శ్రీనివాస్, గద్దె వీరన్నబాబు పాల్గొన్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునుంచే భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు.



వంగలపూడి రేవులో మృత్యుంజయుని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కోరుకొండ మండలంలో..

మధురపూడి: కోరుకొండ మండలంలో పలు శివాలయాలకు భక్తులు పోటెత్తారు. కణుపూరులోని భ్రమరాంబికా సహిత మల్లికార్జునస్వామికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అభిషేకాలు నిర్వహించారు. కాపవరం అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. బూరుగుపూడిలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో ధర్మకర్త క్రొవ్విడి సర్రాజు ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో కాపవరం సర్పంచ్ జాజుల రాము, దేవాలయం ఈఓ పాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభిషేక ప్రియుడు.. ఆ పరమేశ్వరుడు



బిక్కవోలులో కేదారేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు

- అంతటా శివనామ స్మరణ
- శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు

అనపర్తి: శంకరాయ.. శివాయ.. మహేశ్వరాయ.. అంటూ ఆ సర్వేశ్వరుడిని కొలిస్తూ, మహా శివరాత్రి పర్వదినాన భక్తులు తన్మయత్వం చెందారు. శుక్రవారం అనపర్తి నియోజకవర్గంలో శివరాత్రి ఉత్సవాలు అంబరాన్నంటాయి. అనపర్తి మండలంలోని శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. దుప్పలపూడి చంద్రశేఖర స్వామి, పెడపర్తిలోని పార్వతీ రామలింగేశ్వరస్వామి, పొలమూరులోని పార్వతీ రామలింగేశ్వర స్వామి, అనపర్తి పాత ఊరులోని పార్వతీ ఉమా రామలింగేశ్వరస్వామి, ధరణికోట శివాలయం, మార్కండేయపురంలోని భావనాఋషి, కుతుకులూరు కూటేశ్వర స్వామి, సంత మార్కెట్ వద్ద బసవేశ్వర స్వామి, రామవరం, మహేంద్రవాడ, కొప్పవరం, పీరారామచంద్రపురం, లక్ష్మీనరసాపురం గ్రామాల్లోని శివాలయాల్లో లయకారుడికి విశేష పూజలు చేశారు. స్థానిక పాతవూరిలోని పార్వతీ ఉమా రామలింగేశ్వర స్వామివారి ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. స్వామి, అమ్మవార్లకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక అభిషేక, కుంకుమ పూజలు జరిపారు.



జి.మామిడాడ శివారు లక్ష్మీనరసాపురంలో ప్రత్యేక అలంకరణలో మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి

భీమేశ్వరుని సన్నిధిలో ఎమ్మెల్యే దంపతులు

పెదపూడి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో సాగాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జి.మామిడాడ గ్రామం శివారు ఎల్ఎన్‌పురంలో మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి వారిని ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. రథోత్సవం సందర్భంగా ఉత్సవ మూర్తులను పల్లకీ వద్దకు వారు తీసుకొచ్చారు. అనంతరం రథోత్సవాన్ని ప్రారంభించారు. ఎంపీపీ కేతా తులసి, సర్పంచ్ లంక మున్ని, పార్టీ నేత చింతా దొరబాబు, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి పద్మావతి, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీవెంకటరెడ్డి, పైన పీఏసీఎస్ చైర్మన్ సబ్బెళ్ల అమ్మిరెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు మేడపాటి బుల్లి సూరారెడ్డి, కర్రి రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు. అనంతరం సుమారు 10 వేల మందికి అన్నసంతర్పణ జరిగింది. సంపరలో వీక్షణ ముక్తేశ్వర స్వామి ఆలయానికి విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పైన గ్రామంలో భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయం, పెదపూడిలో శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయం, దోమాడ, కరకుదురు, రామేశ్వరం, ఏపీత్రయం, కరకుదురు తదితర గ్రామాల్లో ఉత్సవాలు జరిగాయి.

బిక్కవోలు: బిక్కవోలులో కేదారేశ్వరస్వామి ఆలయాన్ని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీరవెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రాచీన గోలింగేశ్వరస్వామి, ఊలపల్లి అగస్త్యేశ్వరస్వామి ఆలయాలను ఎమ్మెల్యే దంపతులు దర్శించుకున్నారు. పందలపాక కాశీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, గౌరీశంకర ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతర అన్నసమారాధనలు నిర్వహించారు. కొంకుదురులో త్రిముఖ లింగేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కొమరిపాలెం, తొస్సిపూడి, బలభద్రపురం, ఆరికరేవుల, రంగాపురం, కాపవరం తదితర గ్రామాల్లో శివాలయాలు కిక్కిరిశాయి. స్వామివార్లకు పంచామృతాభిషేకాలు చేశారు.



బిక్కవోలులో గోలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి క్షీరాభిషేకాలు

రంగంపేట: మహా శివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని రంగంపేట, చంద్రేడు, పెదరాయవరం, వడిశలేరు, ఈలకొలను, వీరంపాలెం తదితర గ్రామాల్లో శివాలయాలు కిక్కిరిశాయి. రంగంపేటలోని ఉమా రామలింగేశ్వరస్వామి, బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్ల ఆలయంలో తెల్లవారుజాము నుంచే స్వామివారికి అభిషేకాలు చేశారు. చంద్రేడులో కాత్యాయినీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో కుంకుమార్చనలు జరిగాయి. స్వామివారికి హోమం నిర్వహించారు. పాత వీరంపాలెంలో వీరలింగేశ్వరస్వామి, భద్రకాళీ అమ్మవార్ల ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

పల్లెల ప్రగతికి అత్యంత ప్రాధాన్యం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- కొప్పవరంలో పలు పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

అనపర్తి: పల్లెల ప్రగతికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం కొప్పవరంలో పలు అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందన్నారు. అవినీతికి తావు లేకుండా పూర్తి పారదర్శకంగా పథకాలు అమలు చేస్తోందని అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కుల మతాలు, రాజకీయాలకు అతీతంగా పథకాలు అర్హులకు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందరి ప్రభుత్వంగా పేరుగాంచిందన్నారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి సీఎం జగన్ నిబద్ధతను చాటారన్నారు. ప్రజలకు జగనన్న మంచి చేస్తుంటే, ఓర్వలేని ప్రతిపక్షాలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని అన్నారు. టీడీపీ నేతలు ఎన్ని ఆరోపణలు చేసినా ప్రజలు వాటిని నమ్మే స్థితిలో లేరన్నారు. ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందజేస్తున్న జగన్మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలో ఇంటి పన్నులు వసూలుకు విశేష కృషి చేసిన గ్రామ వలంటీర్లను ఎమ్మెల్యే అభినందిస్తూ వారికి బహుమతులు అందజేశారు. అంతకు ముందుగా గ్రామంలోని వెలంపేటలో పందలపాక బోదె కాలువకు మండల పరిషత్, ఎండీఎఫ్ నిధులు రూ. 30 లక్షలతో రిటైనింగ్ వాల్, సీసీ రోడ్డు, గ్రామ పరిధిలోని కొమరిపాలెం డ్రైన్‌పై పంచాయతీ నిధులు రూ. 6 లక్షలతో కల్వర్టు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. అదేవిధంగా గ్రామ సచివాలయం నుంచి రావిచెట్టు శివాలయం వరకూ మండల పరిషత్, గ్రామ పంచాయతీ నిధులు రూ. 36 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, గ్రామంలోని కొవ్వూరి కృష్ణారెడ్డి వీధిలో ఎండీఎఫ్ నిధులు రూ. 4 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి, సర్పంచ్ కర్రి బుల్లిమోహన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ సూరారెడ్డి, ఎంపీటీసీ పోతంశెట్టి మంజు కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ వీర్రాఘవరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కర్రి సర్రెడ్డి, నాయకుడు సత్తి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొప్పవరంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

సంక్షేమ సారథి సీఎం జగన్

బిక్కవోలు: అర్హులందరికీ సంక్షేమాన్ని అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం కొంకుదురు గ్రామంలోని మెయిన్ సీసీ రోడ్డు, రెడ్డి కమ్యూనిటీ హాలు, మార్కెట్ షెడ్ చుట్టూ ప్రహరీ, పైపులైన్ తదితర పనులను మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి శేషారెడ్డితో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అవసరాలు తీర్చి నిజమైన నాయకుడిగా సీఎం జగన్ ఖ్యాతి గడించారన్నారు. ప్రజలు వాస్తవాలు గమనించి మనకు మంచి చేసిన జగనన్నను గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. 14 ఏళ్ల సీఎంగా ఉన్న చంద్రబాబు పేద ప్రజలకు ఏం మేలు చేశారో మీ వద్దకు వస్తున్న టీడీపీ నాయకులను ప్రశ్నించాలన్నారు. ఎన్నికల వేళ చంద్రబాబు, టీడీపీ నాయకులు చెప్పే మాయ మాటలను నమ్మవద్దన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన జగన్ మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ స్థాయి సంఘ చైర్మన్ రొంగల పద్మావతి, సర్పంచ్ సత్తి వీరమణి, ఎంపీటీసీ కొంకుదురు పీపీ, పార్టీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి, స్పీకర్ ఓఎస్డీ పడాల సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి, నల్లమిల్లి శేషారెడ్డి

మహిళా లోకానికి అగ్రస్థానం

బిక్కవోలు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహిళలకు అగ్రస్థానం కల్పించాలని, దాదాపు పథకాలన్నీ అతివల పేరునే అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి అన్నారు. తొస్సిపూడిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు, పారిశుధ్య కార్మికులు, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా యానిమేటర్లు, అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు పోటీ పడుతున్నారుని కొనియాడారు. అన్ని రంగాల్లో మరింత ముందుకు సాగాలన్నారు. ఎంపీటీసీ తేతలి సుమ, ఉప సర్పంచ్ ద్వారంపూడి వీర వెంకట రామారెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు నల్లమిల్లి త్రినాథ్‌రెడ్డి, నాయకురాలు కర్రి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



తొస్సిపూడిలో గర్భిణులకు సీమంతాలు చేసిన ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి

స్త్రీ పాత్ర మహోన్నతం

అనపర్తి: సమాజంలో స్త్రీ పాత్ర మహోన్నతమైందని, మహిళాభ్యున్నతే నిజమైన దేశాభివృద్ధి అని అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామగుర్రెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు కుటుంబానికే పరిమితం కాకుండా తాము ఎంచుకున్న రంగాల్లో పురుషులను సైతం అధిగమించి విజయాలు సొంతం చేసుకుంటున్నారని అన్నారు. మహిళలు పురోభివృద్ధి సాధించడం ద్వారా మెరుగైన సమాజం ఏర్పడుతుందన్నారు. అనంతరం ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న మహిళా వైద్యులు, సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ పద్మశ్రీ, అడ్మినిస్ట్రేటర్ తరుణ్, వైద్యులు రజని, ఆనంద్, వరలక్ష్మి, డేవిడ్ వర్మ, ప్రదీప్, చారి, తేజస్విని, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



అనపర్తి ఏరియా ఆసుపత్రి ఆర్ఎంఓను సత్కరిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి

సీతానగరం మండలంలో..

సీతానగరం: మండలంలోని కాటవరం సంజీవపురం ప్రాథమిక పాఠశాలలో యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ఈ.శ్రీమణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ సమాజం ఆవిర్భావం నుంచి నేటి ఆధునిక జీవనం వరకూ ప్రతి దశలోనూ స్త్రీ సేవలు అద్భుతమన్నారు. అనంతరం జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, జిల్లా కార్యదర్శి శ్రీమణిలను సన్మానించారు. బొబ్బిల్లంక హైస్కూల్ విద్యార్థినులు సందేశాత్మక నృత్య గీతాలను ప్రదర్శించారు.



కాటవరం స్కూల్లో జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీమణికి సన్మానం

కన్నుల పండువగా శివపార్వతుల ఊరేగింపు

- ఘనంగా శివరాత్రి జాగరణోత్సవం
- తరలివచ్చిన భక్తులు

రాజానగరం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాజానగరంలో పుంగనూరు గిత్తల బండిపై సాగిన శివపార్వతుల ఊరేగింపు కన్నుల పండవగా సాగింది. తమిళనాడు కొయంబత్తూరులో ఇషా ఫౌండేషన్ సద్గురు జగ్గీ వాసుదేవ్ ఆధ్వర్యంలో జరిగే శివరాత్రి జాగరణోత్సవం తరహాలో మొట్టమొదటిసారిగా రాజానగరంలో నిర్వహించే ప్రయత్నం చేశారు. ఎంవీఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఉపాధ్యక్షుడు మండవల్లి వెంకటేశ్వరరావు, కాశీఅన్నపూర్ణ దంపతులు ఈ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ జంక్షన్ సమీపంలో 16వ నంబరు జాతీయ రహదారిని అనుకుని ఉన్న సుమారు 30 ఎకరాల ఖాళీ స్థలంలో శివరాత్రి జాగరణ మహోత్సవం జరగనుంది. ఈ ప్రాంగణానికి గ్రామంలోని రాజలింగేశ్వరస్వామి ఆలయం నుంచి శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పుంగనూరు గిత్తల బండిపై 1,116 మంది కళాకారుల కోలాట ప్రదర్శనలు, సన్నాయి వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అనంతరం ఆ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక వేదికపై ఆది దంపతులకు కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి 108 కిలోల ముత్యాలు (బియ్యం) తలంబ్రాలను సమర్పించారు. లింగోద్భవ సమయంలో పార్వతీ పరమేశ్వరుల ప్రార్థలింగా సహిత మన్యుసూక్త పూర్వక మహాన్యాస ఏకాదశ మహారుద్రాభిషేకం, సహస్ర లింగార్చన, లక్ష బిల్వార్చన, సహస్ర కుంకుమార్చనలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి హాజరయ్యారు.



జాగరణోత్సవంలో ఆకట్టుకున్న నృత్యం



రాజానగరంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

పట్టిసీమకు పోటెత్తిన భక్తులు

సీతానగరం: మహాశివరాత్రి సందర్భంగా ఏలూరు జిల్లా పోలవరం మండలం పట్టిసీమ వద్ద గోదావరి మధ్యలో కొలువైన భద్రకాళీ సమేత వీరభద్రుని దర్శనానికి వంగలపూడి, రామచంద్రపురం రేవుల నుంచి శుక్రవారం అధిక సంఖ్యలో భక్తులు తరలివెళ్లారు. వంగలపూడి రేవు నుంచి గోదావరి పాయపై వేసిన నడక మార్గం కిటకిటలాడింది. అలాగే పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోని రామచంద్రపురం రేవు నుంచి ట్రాక్టర్లపై భక్తులు పట్టిసీమకు పయనమయ్యారు. వంగలపూడి రేవు నుంచి గురువారం రాత్రి నుంచే భక్తులు రాకపోకలు ప్రారంభమయ్యాయి.

భక్తులకు అన్ని వసతులు

పట్టిసీమకు తరలివెళుతున్న భక్తులకు అధికార యంత్రాంగం అన్ని వసతులు కల్పించింది. తహసీల్దార్ రహమాన్, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, ఆర్ఐ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఆర్.సుజాత, సర్పంచ్ కొంచ అన్నపూర్ణ, ఎంపీటీసీ సూరెడ్డి గంగాభవాని, ఉత్సవ కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. వంగలపూడి, రామచంద్రపురం రేవులలో భక్తులకు ఉచితంగా భోజన ఏర్పాట్లు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అవినాష్ ఆధ్వర్యంలో రక్షిత తాగు నీటిని అందించారు. ఎస్సై టి.రామకృష్ణ తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. డీఎస్పీ వెంకటేశ్వరరావు, కోరుకొండ సీఐ అడపా నాగ మురళీ తదితరులు రేవులోనే ఉండి ఏర్పాట్లను పరిశీలించారు. వంగలపూడి రేవు, ఇసుక తిన్నెలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలలో సీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య, డాక్టర్ మేఘన, డాక్టర్ ఏసురాణి, డాక్టర్ ఎస్.రాజు సేవలందించారు.



వంగలపూడి రేవు నుంచి పట్టిసీమకు వెళుతున్న భక్తులు